# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- పర్యవేక్షించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చిత్రామిశ్రా



డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది

భీమ్‌గల్,నవంబర్ 29: బాల్కొండ నియోజకవర్గ శాసన సభ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చిత్రామిశ్రా బుధవారం తెలిపారు. నియోజక వర్గ పరిధిలో మొత్తం 246 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.నియోజక వర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2లక్షల 21వేల 445 మంది ఉండగా.. ఇందులో పురుష ఓటర్లు లక్షా రెండువేల 387 మంది, మహిళలు లక్షా 19,056 ఉన్నారని తెలిపారు. ఇతరులు ఇద్దరు ఉన్నారని చెప్పారు. భీమ్‌గల్‌లో 55 పోలింగ్ బూత్‌లు, బాల్కొండలో 27, వేల్పూర్‌లో 39, కమ్మర్‌పల్లిలో 38, మోర్తాడ్‌లో 23, ఏర్గట్లలో 17, మెండోరాలో 23,ముప్కాల్‌లో 18 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేసినట్లు వివరించారు.పోలింగ్ సిబ్బంది పీవోలుగా 296,ఏపీవోలు 296,వోపీవోలు 580,మైక్రో అబ్జర్వర్‌లుగా 54 మందిని నియమించినట్లు తెలిపారు.

**ఎన్నికల సామగ్రి పంపిణీ**

గురువారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎన్నికల సామగ్రిని బుధవారం అందజేశారు. వీవీప్యాట్‌లు, ఈవీఎంలను అందజేశారు. పోలింగ్ స్టేషన్లకు తరలించడానికి ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. 209 మంది పోలీసులు,150 మంది వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీస్ సిబ్బది,13 సెక్షన్ల సాయుధ బలగాలను మొహరించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.



ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చిత్రామిశ్రా



ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది



మండలంలో బుధవారం దీక్షా దివస్ (2009 నవంబర్ 29న ఉద్యమనేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రోజు) నిర్వహించారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని దవాఖానలో రోగులకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పండ్లను పంపిణీ చేశారు.

–భీమ్‌గల్, నవంబర్ 29

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ముప్కాల్ విద్యార్థిని

ముప్కాల్, నవంబర్ 29:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సీహెచ్.వర్ష రాష్ట్ర స్థాయి అండర్–14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గంగారాం బుధవారం తెలిపారు. వచ్చే నెల డిసెంబర్ 6,7,8వ తేదీల్లో కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ పట్టణంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించింది. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్ష

## బాల్కొండలో పారిశుధ్య పనులు

బాల్కొండ, నవంబర్ 29: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులు కొనసాగుతున్నాయి. పంచాయతీ కార్మికులు రోడ్లపై చెత్తచెదారాన్ని బుధవారం తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయొద్దని సూచించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

